లారీలు ఇలా.. వెళ్లేది ఎలా?

- అడ్డగోలుగా లారీల నిలిపివేత
- ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు
- ప్రతిక్షణం భయంతో రాకపోకలు



లారీ యూనియన్ కార్యాలయ సమీపంలో రోడ్లపై నిలిపి ఉంచిన లారీలు, టిప్పర్లు

మణుగూరుటౌన్: మండల కేంద్రమైన మణుగూరు పట్టణ శివారులో నిత్యం పదుల సంఖ్యలో లారీలు రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచడంతో సీఎస్పీ సెంటర్‌ను దాటి వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం బీటీపీఎస్‌కు వెళ్లే వందల సంఖ్యలో లారీలతో పాటు మణుగూరు ఓసీ నుంచి కేసీహెచ్‌పీకి వెళ్లే బొగ్గు లారీలు, ఇసుక సొసైటీలకు తరలివెళ్లే లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటి మధ్య కష్టతరంగా ప్రజలు తమ వాహనాలతో ప్రయాణం చేస్తుంటారు. వెరసి కొత్తగూడెం-ఏటూరు నాగారం ప్రధాన రహదారి ప్రయాణికుల రద్దీతో ఉంటుంది. ఇలాంటి ప్రదేశాల్లో కూడా కూడళ్ల వద్ద, లారీ యూనియన్ కార్యాలయాల పరిసరాల్లో లారీలు నడిరోడ్డుపైనే నిలిపుతున్నారు. దీంతో అప్పటికే లారీల మధ్య ప్రయాణిస్తున్న వాహనదారులకు నిలిపి ఉన్న లారీలతో భయకంపితులు అవుతున్నారు.

నిత్యం దుమ్మూధూళి..

ఈ రహదారిపై రోజూ తిరిగే వేలాది వాహనాల రాకపోకలతో దుమ్ము నిరంతరం వెదజల్లుతుంది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించే పరిస్థితి లేదంటే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో అటుగా ప్రయాణించాలంటేనే ప్రయాణికులు, బాటసారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇలాగే ఇటీవల బీటీపీఎస్‌కు చెందిన ఓ మహిళా ఉద్యోగికి ప్రమాదం జరగ్గా.. తరచూ ప్రమాదాలు సర్వసాధారణంగా మారింది. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను గుర్తించి డీఎస్పీ రవీందర్‌రెడ్డి రోడ్లపై లారీలు నిలిపి ఉంచడంతో జరుగుతున్న ప్రమాదాలపై సంబంధిత యూనియన్ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరికలు ఇచ్చారు. అయినా పోలీసు అధికారుల హెచ్చరికలు మూన్నాళ్లముచ్చటే అయ్యాయన్న ఆరోపణలున్నాయి.

రిపేర్ల పేరిట రోడ్లపై నిలిపివేత..

పట్టణ శివారులోని లారీ యూనియన్, కార్యాలయం 14 టైర్ల టిప్పర్ కార్యాలయం సమీపంలో టైర్ల దుకాణాలతో పాటు ఇతర రిపేర్ల దుకాణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రిపేర్ల కోసమనే పలు లారీలు రోడ్లపైనే నిలుపుతున్నారు. కొన్ని వాహనాలు రిపేర్లు లేకపోయినా ఆయా కార్యాలయాల సమీపంలో ప్రధాన రహదారిని ఆక్రమించి రోజుల తరబడి నిలిపివేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపై ఒక ఆరు టైర్ల వాహనం వెళ్లే మరో వాహనం వెళ్లే పరిస్థితి లేదు. వీటికి తోడు ఆయా వాహనాల వల్ల వచ్చే దుబ్బుకు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక మోటార్‌సైకిళ్లు, ఆటోలు అయితే ఒక్కోసారి ఒక వాహనం వెళ్లిన తర్వాత మరో వాహనం వెళ్లాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలోనే పేరుకు పట్టణ కేంద్రం శివారు ప్రాంతం మాత్రం ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. ఇప్పటికైనా పోలీసుశాఖ దృష్టి సారించి మూల మలుపుల వద్ద ప్రధాన రహదారిని ఆక్రమించి మరి లారీల నిలిపివేతపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణించాలంటేనే భయం



పట్టణ శివారు దాటి బీటీపీఎస్ వైపు వెళ్లాలంటేనే భయం వేస్తోంది. ఎప్పుడూ పదుల సంఖ్యలో లారీలను రిపేర్ల పేరుతో నిలిపి ఉంచడంతో అటుగా ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. ఇక కుటుంబంతో వెళ్లాల్సి వస్తే ప్రయాణం విరమించుకోవాల్సిన పరిస్థితి. కండ్లలో పడే దుబ్బకి కండ్ల సమస్యలు వస్తున్నాయి. పోలీసులు దృష్టి సారించి లారీల నిలిపివేతను కట్టడి చేయాలి.

– చామంచుల శ్రీనివాస్, ప్రయాణికుడు

ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే కేసులు



ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకోం. లారీల నిలిపివేతపై యజమానులకు సూచించాం. లారీల కార్యాలయాల చుట్టూ 100 మీటర్ల లోపు లారీలు నిలిపి ఉంచరాదని హెచ్చరికలు ఇచ్చాం. ప్రమాద మలుపులు, లారీల రద్దీ తీవ్రంగా ఉన్న ప్రదేశాల్లో లారీలు నిలిపి ఉంచి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదు. కేసులు పెడతాం.

– డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ



దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ సతీష్‌కుమార్

దమ్మపేట: దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ నిర్వహణ సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. కేసుల విచారణ, పురోగతి తదితర వివరాలను బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో స్థానికంగా ఉన్న సమస్యల గూర్చి వాకబు చేశారు. స్టేషన్, రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సై సాయికిషోర్ రెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

అశ్వారావుపేటరూరల్: దేశ విభజన సమయంలో వేలాది హిందువుల ప్రాణాలు కోల్పోయిన త్యాగాలను స్మరించుకుంటూ.. విభజన గాయాల స్మృతి దినంగా ఈ నెల 14న పాటించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సూచించారు. ఆదివారం అశ్వారావుపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విభజన గాయాల స్మృతి దినం, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో దేశభక్తి జ్వాలలు పెంచాలని అన్నారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ప్రతి మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించాలని, ఈ నెల 15వ తేదీన ప్రతి ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసేందుకు బీజేపీ బూత్ స్థాయి, మండల స్థాయి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మెట్టా వెంకటేష్, రాయుడు ఆంజనేయులు, పమ్మిడి లక్ష్మీనారాయణ, ఎస్‌వీటీ కొండ, రాజేష్ పాల్గొన్నారు.

సంస్థను బలోపేతం చేయాలి

అశ్వారావుపేటరూరల్: జమియాత్ ఉలామా–ఎ–హింద్ సంస్థను బలోపేతం చేసుకోవాలని జిల్లా బాధ్యులు మహమ్మద్ అబ్దుల్ కరీం రషీద్ కోరారు. ఆదివారం స్థానిక జామియా మసీదులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వతంత్రం రాకముందు నుంచే సంస్థను ఏర్పాటు చేశారని, ఈ సంస్థ ద్వారా ముస్లిం సోదరుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సంస్థ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ కమిటీలో చేరి బలోపేతం చేసుకోవాలన్నారు. అనంతరం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎంబీ.రఫీ అహ్మద్, షేక్ షబ్బీర్ నాయబ్, ఎండీ.ముక్రరం ఖాన్, షేక్ జాకీర్, షేక్ షరీఫ్ అహ్మద్‌తోపాటు పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కరకగూడెం: నేడు మండలంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటిస్తున్నట్లు కరకగూడెం తహసీల్దార్ గంట ప్రతాప్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు భట్టుపల్లి వద్ద ఉన్న రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు,కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని కావున సమాచారం అందుకున్న లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న విచారణ?

ములకలపల్లి: రంగాపురం శివారులోని అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాంటేషన్‌లో జామాయిల్ మొక్కల చోరీపై ఆదివారం కూడా క్షేత్రస్థాయి విచారణ చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ ప్రదేశంలో 500 పైగా చెట్లు అక్రమార్కులు నరికి, బయటికి తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తరుణంలో కొంత కలపను ములకలపల్లి ప్రైవేటు అడితిలో స్వాధీనం చేసుకున్నారు. ఒకరిపై కేసు నమోదు చేసి, 65 వేలు జరిమానా విధించారు. దీంతో హైదరాబాద్ కేంద్ర కార్యాలయ ఉన్నతాధికారి క్షేత్రస్థాయిలో రెండో రోజైన ఆదివారం కూడా విచారణ చేపట్టినట్లు సమాచారం. నరికిన మొక్కలు, బయటికి తరలిన విలువైన కలప విషయాల్లో వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. ఈ విషయమై ప్లాంటేషన్ మేనేజర్ (పీఎం) సునీతను వివరణ కోసం ప్రయత్నించగా, ఫోన్ అందుబాటులోకి రాలేదు.

కార్మికులకు దోమ తెరల పంపిణీ



దోమ తెరలను అందిస్తున్న జక్కుల రాంబాబు, తదితరులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి ఆదివారం ఉచితంగా దోమ తెరలను పంపిణీ చేశారు. నారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ నాయకులు జక్కుల రాంబాబు తన సొంత ఖర్చులతో కార్మికులు, సిబ్బందికి వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వానా కాలం సీజన్ నేపథ్యంలో దోమ తెరలను అందించినట్లు తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ములకలపల్లి: కొత్తగా పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుండి 59 ఏళ్ల వయసులోపు రైతులు ఈ పథకానికి అర్హులని, ఈనెల 13లోగా విధిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంతో రైతుబీమా చేసుకున్న రైతులు నామినీ పేరు మార్చాలంటే రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఏఈఓలను సంప్రదించాలని తెలిపారు.

ఉద్యమ నాయకురాలు మృతి



నాగమణి (ఫైల్)

దమ్మపేట: బీఆర్ఎస్ ఉద్యమ నాయకురాలు తాతా నాగమణి(70), తీవ్ర అనారోగ్య కారణంగా మృతి చెందారు. మండలంలోని వడ్లగూడెం గ్రామానికి చెందిన నాగమణి, గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య కారణంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ, ఆదివారం కన్నుమూశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అప్పటి టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు ఉద్యమాల్లో ఆమె క్రియాశీలకంగా పాల్గొన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆమెకు ఉమ్మడి ఖమ్మం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కోఆర్డినేటర్ నామినేటెడ్ పదవిని ఇచ్చి, తగు గుర్తింపును ఇచ్చారు. వడ్లగూడెంలో ఆమె భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్‌తో పాటుగా పలువురు నాయకులు పూలతో నివాళులర్పించారు.

పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలి



మాట్లాడుతున్న అఖిలపక్ష, ప్రజాసంఘాల నాయకులు

మణుగూరురూరల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని అఖిల పక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మౌనిక రెస్టారెంట్ హాల్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. పాలస్తీనా పై ఇజ్రాయిల్ అమానుషంగా దాడులు చేస్తోందని, విచక్షణారహితంగా చంపడం, మందులు, ఆహారం కూడా లేకుండా చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఆయా అంశాలపై నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఆర్ మధుసూధన్‌రెడ్డి, కుంట లక్ష్మణ్, సాగర్, గద్దం వెంకటేశ్వర్లు, వట్టం నారాయణదొర, వాసిరెడ్డి చలపతిరావు, మల్లెల రామయ్య, పి.సంజీవరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, పి.నాగార్జున, ముస్లిం మిల్లత్, జమాతే ఇస్లామిక్ హింద్ నాయకులు ఎండి.సిరాజ్ పాషా, ఎండి.బాబా, ఎండి.రఫీ, సాగర్ పాల్గొన్నారు.

12న కొమురం భీం విగ్రహావిష్కరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందా లింగయ్య దొర

మణుగూరురూరల్: మండల పరిధిలోని చిక్కుడు గుంట గ్రామంలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఎదుట రేపు మన్యంవీరుడు కొమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆదివాసీ(గిరిజన) అభ్యుదయ సంఘం జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్యదొర తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న డీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి ధనసరి సీతక్క చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఆదివాసీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీటీపీఎస్ నష్టపరిహార విషయంలో జరిగిన కుంభకోణంపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని, ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు గొగ్గెల ఆర్‌కే దొర, చిడెం నాగేశ్వరరావు, వజ్జా నర్సింహారావు, కుంజా వెంకటరమణ, మడి శంకర్, కొమరం రామ్మూర్తి, ఏనిక మంగమ్మ, కొడెం నర్సమ్మ, కుంజా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పాస్‌బుక్ ఉంటేనే యూరియా

ములకలపల్లి: మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో యూరియా కొనుగోలు చేసే రైతులు ఆధార్ కార్డుతోపాటు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ విధిగా తమ వెంట తెచ్చుకోవాలని సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు తెలిపారు. పట్టాలేని రైతులు స్థానిక మండల వ్యవసాయాధికారి లేదా ఏఈఓ నుంచి కూపన్లు రాయించుకుని రావాలన్నారు. పట్టా పుస్తకాలు లేనిరైతులకు పీఏసీఎస్‌లో నేరుగా యూరియా విక్రయించమని స్పష్టం చేశారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

ములకలపల్లి: అన్నదాతలపై అటవీశాఖ అధికారులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గుట్టగూడెం గ్రామంలో కుంజా కృష్ణ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. దమ్మపేట మండలం నాగుపల్లి జీపీలో రైతులు ఎన్నోఏళ్లుగా సాగు చేస్తున్న భూమిని అటవీశాఖ అధికారులు అడ్డుకుని, సాగుదారులపై అన్యాయంగా కేసులు బనాయించారని ఆరోపించారు. బేషరతుగా కేసులను వెనక్కితీసుకోవాలని అన్నారు. పార్టీ డివిజన్ నాయకులు మారుతి రాఘవులు, వంకా సురేశ్, మడివి గోపాలకృష్ణ, కొర్రి నరేశ్, కొర్రి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య కుటుంబానికి పరామర్శ



అయోధ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య చారి కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యలు వేరువేరుగా పరామర్శించారు. రామానుజవరంలోని వారి నివాసానికి చేరుకుని, అయోధ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అయోధ్యతో తమకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పి.నవీన్, గాండ్ల సురేశ్, సీపీఐ నాయకులు సరెడ్డిపుల్లారెడ్డి, సుధాకర్, రాజాబాబు, బాడిశ సతీష్ తదితరులు ఉన్నారు.

పిచ్చిమొక్కల నడుమ రోడ్డు



తేగడలో తాలిపేరు వంతెన అప్రోచ్ రోడ్‌కు ఇరువైపులా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు

చర్ల: మండలంలోని తేగడ సమీపంలో ఉన్న తాలిపేరు వంతెనకు.. తేగడ వైపున ఉన్న అప్రోచ్ రోడ్‌కు ఇరువైపులా చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి అటవిని తలపిస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణించే పాదచారులు, వాహనదారులు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా చెట్లలో నుంచి అకస్మాత్తుగా కోతులు, కుక్కలు రోడ్డుపైకి పరుగెత్తుకుంటూ వస్తుండడంతో వాటిని తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అదే విధంగా రాత్రిపూట పాములు కూడా ఈ చెట్లల్లోంచి రోడ్డుపైకి చేరుతున్నాయని పాదచారులు వాపోతున్నారు. ఆయా చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముత్యాలమ్మకు మొక్కులు



ములకలపల్లి: ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



గుండాలలో బోనాలతో వస్తున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం నేపథ్యంలో భక్తులు ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

ములకలపల్లి: శ్రావణమాసం ఆదివారం నేపథ్యంలో భక్తులు ముత్యాలమ్మ తల్లికి మొక్కలు చెల్లించుకున్నారు. తొలుత అభయాంజనేయ స్వామి ఆలయంలో, అటుపిమ్మట బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు నెత్తినపెట్టుకొని గ్రామ శివారులోని ముత్యాలమ్మ ఆలయానికి తరలివెళ్లారు. తల్లికి చీరె, సారె, పలురకాల నైవేద్యాలు సమర్పించున్నారు. కోళ్లు, మేకలు కోసి మొక్కలు చెల్లించుకున్నారు.

శ్రావణమాస బోనాలు..

గుండాల: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఆదివారం ఘనంగా భోనాల పండుగ నిర్వహించారు. ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో మహిళలంతా బోనాలు తలలపై పెట్టుకుని ఊరేగింపుగా గ్రామ దేవతలైన బొడ్రాయి, ముత్యాలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. పిండివంటలు, పాయసంను నైవేద్యంగా దేవతలకు సమర్పించారు. డప్పు వాయిద్యాలతో మహిళలు పూనకాలతో ఊగిపోయారు. వానలు సమృద్ధిగా కురవాలను, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. కోళ్లు, మేకలను బలిచ్చారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట, బీజీకొత్తూరు, మల్లెలమడుగు, సీతరాంపురంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ముత్యాలమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తులు, డప్పులు చప్పుళ్లతో గ్రామాలలో కోలాహలంగా మారింది. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని మహిళలు వేడుకున్నారు.

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలంలోని జానకీపురం గ్రామాల్లో ఆదివారం శ్రావణమాసాన్ని పురస్కరించుకుని బోనాల సంబురాలు చేశారు. డప్పువాయిద్యాలు, నృత్యాలతో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలు బాగుండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని దేవతలకు మొక్కుకున్నారు.



అశ్వారావుపేటరూరల్: చిలకలగండి ముత్యాలమ్మ ఆలయంలో భక్తులు



అన్నపురెడ్డిపల్లి: డప్పువాయిద్యాలతో దేవతల వద్దకు వెళ్తున్న మహిళలు



అశ్వాపురం: మొండికుంటలో ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద బోనాలతో మహిళలు

అధ్వానంగా బస్‌షెల్టర్లు!

- నిర్వహణను పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- ప్రయాణికులకు అక్కరకురాని స్టాప్‌లు
- చెట్లనీడ కిందే బస్సుల కోసం ఎదురుచూపులు



అధ్వానంగా ఉన్న లక్ష్మీనగరం గ్రామంలోని బస్టాండ్



పిచ్చి మొక్కలతో నిండిన పెద్దబండిరేవు క్రాస్ రోడ్డు దగ్గరి బస్టాండ్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై ప్రయాణికుల సౌకర్యార్థం స్వచ్ఛంద సంస్థలు, దాతలు నిర్మించి ఆర్టీసీకి అప్పగించిన బస్ షెల్టర్లు నేడు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. బస్ షెల్టర్ నిర్వహణ లోపించడంతో దాతల సహకారం ప్రయాణికులకు ఉపయోగకరంగా లేకుండా పోయింది.

పిచ్చిమొక్కలు.. అపరిశుభ్రం

మండల ప్రధాన గ్రామంగా ఉన్న లక్ష్మీనగరం బస్ షెల్టర్ కింద ఫ్లోరింగ్ పగిలింది. డ్రెయినేజ్ బయటకు దర్శనం ఇస్తూ మురికి కూపంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇక్కడ బస్సుల కోసం వేచి చూస్తుంటారు. వీరు ఈ బస్ షెల్టర్ లోపల కూర్చునే వీలు లేకుండా ఉండడంతో.. ఎండైనా వానైనా బస్టాండ్ బయటనో, చెట్ల కిందనో నిలుచొని బస్సుల కోసం వేచిచూస్తున్నారు. మండలంలో నడికుడి, పర్ణశాల క్రాస్ రోడ్డు, కాసా రేగుబల్లి గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి దాపురించింది. ఈ ప్రాంతాల్లో రోడ్డు పక్కనే నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణ కొరవడి ప్రయాణికులు కూర్చునేందుకు అనువుగా లేవు. ఒకప్పుడు ప్రయాణికులతో కళకళలాడిన ఈ షెల్టర్లలో నేడు పిచ్చి మొక్కలు మొలిచి, ఫ్లోరింగ్ పగిలి పోయి అపరిశుభ్రత తయారయ్యాయి.

పంచాయతీ కట్టించి ఇచ్చినా..

మండలంలోని పర్ణశాల పంచాయతీ పరిధిలో ఉన్న పెద్దబండిరేవు క్రాస్ రోడ్డు వద్ద బస్టాండ్ ఉంది. దీనిని పంచాయతీ నిధులతో నిర్మించి ఆర్టీసీ అందించారు. ఇక్కడ కూడా పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి ప్రయాణికులకు ఇబ్బందికరంగా తయారయ్యాయి. పంచాయతీ పరిధిలోని పెద్దబండిరేవు, ములకనాపల్లి తదితర గ్రామాల ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడాల్సిన ఈ షెల్టర్.. పట్టించుకునేవారు లేక ప్రస్తుతం వృథాగా పడి ఉంది.

చర్యలతో పరిష్కారం..

ప్రస్తుతం ఉన్న బస్‌షెల్టర్లకు ఆర్టీసీ అధికారులు కొంత మరమ్మతులు చేయించి, నిత్యం నిర్వహణను పర్యవేక్షిస్తే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి. దాతలు లక్షలు వెచ్చించినప్పటికీ ప్రయాణికులు రోడ్లమీదే పడిగాపులు కాయాల్సి దుస్థితి తప్పుతుంది. ఈ దిశగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంది. స్వచ్ఛంద సంస్థలైనా నడుం కట్టి వాటిని వాడుకలోకి తీసుకురావాల్సి ఉంది.

మరమ్మతులతో ఉపయోగకరం..



లక్ష్మీనగరం గ్రామంలోని బస్ షెల్టర్‌ను ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేయిస్తే ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. బస్సుల రాక కోసం ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగస్తులు రోడ్డుపై నిల్చుని ఎదురుచూస్తున్నారు. బస్‌షెల్టర్ మరమ్మతు చేయిస్తే లోపల కూర్చునేందుకు వీలుగా ఉంటుంది. అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి.

– డింగి సందీప్‌రెడ్డి, లక్ష్మీనగరం

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు..



లక్ష్మీనగరం చుట్టు పక్కల గ్రామాల నుంచి పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు బస్ షెల్టర్ అధ్వానంగా ఉండటంతో కూర్చునే వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకుని రావాలి.

– దల్లి హరిబాబు, లక్ష్మీనగరం